నమస్తే తెలంగాణ
ఖమ్మం
10 | ఖమ్మం, సోమవారం 7 ఏప్రిల్ 2025 | KHAMMAM

శ్రీరాముడు, సీతాదేవి శిరస్సులపై ధరింపజేసే జీలకర్ర, బెల్లం మిశ్రమాన్ని భక్తులకు చూపిస్తున్న అర్చకులు

జగత్కల్యాణం.. నేత్రపర్వం

చూచువారలకు చూడముచ్చటట..

- సీతారాముల కల్యాణాన్ని కనులారా వీక్షించిన తరించిన భక్తజనం
- పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించిన ముఖ్యమంత్రి
- శ్రీరామనామస్మరణతో మార్మోగిన భద్రగిరి
- నేడు శ్రీరామ మహా పట్టాభిషేకం.. హాజరుకానున్న గవర్నర్

ఖమ్మం, ఏప్రిల్ 6 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): 'జగదానందకారకుడు.. జగదభిరాముడు..' అంటూ భక్తకోటి తీరొక్క పేరుతో పిలుచుకునే భద్రాద్రి రాములోరి కల్యాణ వేడుక భద్రగిరిలో ఆదివారం నేత్రపర్వంగా సాగింది. అభిజిత్ లగ్నంలో జగన్మాత సీతమ్మతల్లి మెడలో శ్రీరాముడు మాంగళ్యధారణ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం తరపున ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దంపతులు స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించగా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతకుమారి ముత్యాల తలంబ్రాలు అందజేశారు. దేవదేవుడి కల్యాణ క్రతువును తిలకించి భక్తజనం పులకించిపోయింది. ఆదివారం తెల్లవారుజామున 2 గంటలకు అర్చస్వాములు ఆలయ తలుపులు తెరిచి సుప్రభాతసేవ నిర్వహించారు. అనంతరం తిరువారాధన, మూలవరులకు అభిషేకం, ధృవ మూర్తుల కల్యాణం నిర్వహించారు. ఈ క్రతువు ముగిసిన తర్వాత కల్యాణమూర్తులకు అలంకరణ చేశారు. మేళతాళాలు, భక్తుల జయజయ ధ్వానాల మధ్య ప్రత్యేక పల్లకీలో కల్యాణమూర్తులను ఊరేగింపుగా మిథిలా స్టేడియానికి తీసుకొచ్చి ఆసీనులను చేశారు. అక్కడ కిక్కిరిసిన భక్తజనసందోహం నడుమ శిల్పకళాశోభితమైన మండపంలో జానకిరాముల కల్యాణఘట్టం ఆరంభమైంది. అనంతరం సీఎం రేవంత్‌రెడ్డి దంపతులు, రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖలు స్వామివారికి పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించారు. కల్యాణ క్రతువులో తిరుకల్యాణానికి సంకల్పం పలికి సర్వవిజ్ఞాన శాంతికి విశ్వక్సేన ఆరాధన నిర్వహించారు. ఆ తర్వాత కల్యాణానికి ఉపయోగించే సామగ్రికి సంప్రోక్షణ గావించి రక్షాబంధనం నిర్వహించి యోక్త్రధారణ చేశారు. 12 దర్భాలతో ప్రత్యేకంగా అల్లిన తాడును సీతమ్మ నడుముకు అలంకరించారు. శ్రీరాముడికి సీతమ్మ తగిన వధువని పెద్దలు నిర్ణయించి ఇరువంశాల గోత్రాలు పఠించారు. స్వామివారి పాదప్రక్షాళన చేసి మహాదానాలు సమర్పించారు. భక్తరామదాసు చేయించిన పచ్చలహారం సహా పలు ఆభరణాలు స్వామి, అమ్మవార్లకు అలంకరించారు. కల్యాణ వైభవాన్ని చాటిచెప్పేలా చూర్ణికను పఠించిన అనంతరం వేదమంత్రోచ్ఛరణలు మార్మోగుతుండగా జీలకర్ర, బెల్లం మిశ్రమాన్ని సీతారాముల శిరస్సులపై ఉంచారు. ఈ జగత్కల్యాణ శుభసన్నివేశాన్ని భక్తులు కన్నులారా వీక్షించి తన్మయత్వం చెందారు. లోకమంతా వేయికళ్లతో ఎదురుచూస్తుండగా సీతమ్మ తల్లి మెడలో రామయ్య తండ్రి మాంగళ్యధారణ చేశారు. జగదభిరాముడు మూడుముళ్లు వేసిన క్షణాన ముల్లోకాలు మురిసిపోయాయి. లక్షలాదిగా తరలివచ్చిన భక్తుల రామనామస్మరణ మధ్య జగదభిరాముడు జానకమ్మను మనువాడారు. రాముడు దోసిట ఉన్న తలంబ్రాలు నీలపురాళులుగా, జానకి దోసిట ఉన్న తలంబ్రాలు మణిమాణిక్యాలుగా సాక్షాత్కరించిన వేళ మిథిలా స్టేడియం భక్తి పారవశ్యంలో ఓలలాడింది. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సహా పలువురు మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు, కలెక్టర్ జితేశ్ వి పాటిల్, ఐటీడీఏ పీవో రాహుల్, ఎస్పీ రోహిత్‌రాజ్ పాల్గొన్నారు.

నేడు మహాపట్టాభిషేకం..

శ్రీరామనవమి బ్రహ్మోత్సవాల్లో భాగంగా రాములోరి కల్యాణం జరిపిన మరుసటి రోజు (సోమవారం) శ్రీరామ మహాపట్టాభిషేకం నిర్వహించనున్నారు. సోమవారం ఉదయం 10:30 గంటలకు జరిగే ఈ పట్టాభిషేక వేడుకకు గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ హాజరుకానున్నారు. స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించనున్నారు.

భద్రాచలంలో శ్రీసీతారాముల కల్యాణ మహోత్సవంలో కుటుంబ సభ్యులతో వద్దిరాజు

భద్రగిరిలో భక్తుల పాట్లు

- రామయ్య కల్యాణ ఏర్పాట్లలో ప్రభుత్వ వైఫల్యం
- ఎండలోనే కల్యాణాన్ని తిలకించిన భక్తులు
- ట్రాఫిక్ నియంత్రణ కరువు.. గంటలకొద్దీ కదలని బస్సులు
- గంట ఆలస్యంగా వచ్చిన ముఖ్యమంత్రి

మిథిలా స్టేడియం వద్ద ఎండలో ఉండే కల్యాణాన్ని వీక్షిస్తున్న భక్తులు

భద్రాద్రి కొత్తగూడెం, నమస్తే తెలంగాణ/ భద్రాచలం, ఏప్రిల్ 6 : దక్షిణ అయోధ్యగా పేరొందిన భద్రగిరిలో భక్తులకు పాట్లు తప్పడం లేదు. ఆదివారం శ్రీరామనవమి సందర్భంగా జరిగిన శ్రీ సీతారాముల కల్యాణ ఏర్పాట్లలో కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యం కొట్టొచ్చినట్లు కనబడింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వస్తున్నారని వారంరోజుల ముందునుంచే ఏర్పాట్లు చేసినప్పటికీ భక్తులకు తగిన సౌకర్యాలు ఏర్పాటు చేయడంలో అధికారులు విఫలమయ్యారు. దూరప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వసతి సౌకర్యం లేకపోవడంతో బంధువుల ఇండ్ల వద్దనే ఉండాల్సి వచ్చింది. భద్రాచలంలో ఉన్న అన్ని లాడ్జీల్లో అధిక శాతం గదులను అధికారులు యంత్రాంగానికి వినియోగించుకొని కొన్ని గదులను మాత్రమే లాడ్జీల యజమానులకు ఇచ్చారు. దీంతో యజమానులు ఇదే అదునుగా గదుల అద్దెలను అమాంతం పెంచేశారు. ఒక్కో డబుల్ బెడ్రూంకు పదివేలకు పైగానే అద్దె వసూళ్లు చేశారు. చాలామంది భక్తులు వేరే ప్రాంతాల్లో ఉండి కల్యాణాన్ని తిలకించడానికి భద్రాచలం రావాల్సి వచ్చింది.

ఎండలోనే కల్యాణాన్ని తిలకించిన భక్తులు

సీతారాముల కల్యాణానికి ఈ సారి భక్తులు అధికసంఖ్యలో తరలిరావడంతో అధికారులు వారికి నీడను కూడా ఏర్పాటు చేయలేకపోయారు. సెక్టార్ల వెనుక భాగంలో చాలామంది భక్తులు ఎండలోనే కూర్చొని కల్యాణాన్ని తిలకించారు. గ్రామ పంచాయతీ కార్యాలయం సమీపం నుంచి ఒకవైపు మాత్రమే టెంట్లు వేసి మిగతా ప్రాంతాల్లో వేయకపోవడంతో భక్తులు ఎండకు తట్టుకోలేకపోయారు. చివరివరకు ఉండలేక మధ్యలోనే ఇంటిముఖం పట్టారు. రహదారి చాలా ఇరుగ్గా ఉండటంతో భక్తుల రద్దీ బాగా పెరిగింది. అక్కడే అన్నప్రసాదాలు ఏర్పాటు చేయడంతో తొక్కిసలాట జరిగిన ఆహార పదార్థాలను రోడ్లపైనే పడేసుకున్నారు.

ట్రాఫిక్ నియంత్రణ కరువు

కల్యాణానికి వచ్చిన భక్తులు ఎక్కువగా నాలుగుచక్రాల వాహనాలు తీసుకురావడంతో పార్కింగ్ స్థలాలను ఎప్పటిలాగే కేటాయించారు. దీంతో వాహనాల రద్దీ బాగా పెరిగింది. వాహనాలకు తగ్గట్టు పార్కింగ్ స్థలాలు లేకపోవడంతో భద్రాచలంలో ట్రాఫిక్ నియంత్రణ కష్టంగా మారింది. మధ్యాహ్నం ఒంటి గంట నుంచి మూడుగంటల వరకు ట్రాఫిక్ ఇబ్బందులు తప్పలేదు. బస్సుల కోసం భక్తులు గంటల తరబడి పడిగాపులు కాయాల్సి వచ్చింది.

గంట ఆలస్యంగా వచ్చిన సీఎం

సీతారాముల కల్యాణానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి షెడ్యూల్ ప్రకారం 11 గంటలకు మిథిలాస్టేడియానికి చేరుకోవాలి.. కానీ గంట ఆలస్యంగా రావడంతో అటు పోలీసులు ఇటు అధికార యంత్రాంగం ఎదురుచూడాల్సి వచ్చింది. ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ముందుగానే మిథిలా స్టేడియానికి చేరుకున్నారు. సీఎం రామయ్య దర్శనానికి వెళ్లి కల్యాణమండపానికి వచ్చారు. సరిగ్గా అరగంట వరకు ఉన్న ఆయన కనీసం మీడియాతో కూడా మాట్లాడకుండానే వెళ్లిపోయారు. ఎటొచ్చి సీఎం వస్తున్నారని తెగ హడావుడి చేసిన అధికారులు భక్తులకు చుక్కలు చూపించారు.

వీఐపీలకే అధిక ప్రాధాన్యం.. అసహనంలో సామాన్యజనం

భద్రాచలం రామయ్య కల్యాణాన్ని వీక్షించేందుకు రాష్ట్రనలుమూలల నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి భక్తజనం భద్రాద్రికి రావడం ఆనవాయితీ. అయితే ఆదివారం జరిగిన శ్రీసీతారాముల కల్యాణం చూసే భాగ్యం వీఐపీలు, అధికారుల కుటుంబాల వారికే దక్కింది తప్ప రెండ్రోజుల ముందుగా వచ్చిన భక్తులకు దక్కకపోవడంతో అసహనానికి గురయ్యారు. అధికారగణం వీఐపీలకే ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చిందనే వాదనలూ భక్తుల నుంచి వినిపించాయి. మిథిలా స్టేడియం చుట్టూ ఏర్పాటు చేసిన ఎల్ఈడీలు పనిచేయకపోవడంతో మరింత అసహనానికి గురయ్యారు. సీఎం రేవంత్ రెడ్డి రావడంతో అడుగడుగునా పోలీసులు ఆంక్షలు విధించడంతో భక్తులు మండిపడ్డారు.

కిన్నెరసానిలోని పాల్వంచ రూరల్ పోలీసుస్టేషన్‌లో పోలీసుల అదుపులో ఉన్న బీఆర్ఎస్, సీపీఎం, మాస్‌లైన్ నేతలు, మాలమహానాడు సంఘం నాయకులు

బీఆర్ఎస్ సహా వామపక్ష నేతల..

ముందస్తు అరెస్టు

సీఎం పర్యటన నేపథ్యంలో ఆందోళనలు చేస్తారన్న అనుమానం

గ్యారెంటీ హామీల అమలులో వైఫల్యంపై నిలదీస్తారన్న భయం

అర్ధరాత్రి అదుపులోకి తీసుకొని పాల్వంచ పీఎస్‌కు తరలింపు

బూర్గంపహాడ్, ఏప్రిల్ 6: శ్రీరామనవమిలో భాగంగా భద్రాచలంలో జరిగే సీతారాముల కల్యాణానికి సీఎం రేవంత్‌రెడ్డి ఆదివారం హాజరైన నేపథ్యంలో బీఆర్ఎస్ సహా సీపీఎం, సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్, మాలమహానాడు నాయకులను శనివారం అర్ధరాత్రి పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు. గ్యారెంటీ హామీల అమలులో ప్రభుత్వ వైఫల్యాన్ని నిలదీస్తారేమోనని, సీఎం కాన్వాయ్‌ను అడ్డుకుంటారేమోననే అనుమానాలతో వారిని అదుపులోకి తీసుకున్నారు. అయితే, భద్రాచలంలోని సీతారాముల కల్యాణంలో పాల్గొన్న అనంతరం భద్రాద్రి జిల్లా బూర్గంపహాడ్ మండల సారపాకలో సన్నబియ్యం లబ్ధిదారుడైన గిరిజనుడు బూరం శ్రీనివాసరావు ఇంట్లో సన్నబియ్యంతో భోజనం చేసేందుకు సీఎం రేవంత్‌రెడ్డి సారపాకకు వచ్చే షెడ్యూల్ ఉంది. ఆయన సారపాకకు వచ్చిన క్రమంలో బీఆర్ఎస్ నేతలు, సీపీఎం, సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్, మాలమహానాడు నాయకులు నిరసన కార్యక్రమాలు చేపడతారన్న భయంతో ప్రభుత్వం పోలీసులకు ఆదేశాలు జారీ చేసింది. దీంతో రంగంలోకి దిగిన పోలీసులు శనివారం అర్ధరాత్రి 12 గంటల నుంచి ఆదివారం తెల్లవారుజామున 2 గంటల సమయంలో బూర్గంపహాడ్ మండలంలోని ఆయా నేతల ఇళ్లకు వెళ్లి వారిని అదుపులోకి తీసుకున్నారు. తొలుత వారిని భద్రాచలం పోలీసు స్టేషన్‌కు, అక్కడి నుంచి కిన్నెరసానిలో ఉన్న పాల్వంచ రూరల్ పోలీస్‌స్టేషన్‌కు తరలించి నిర్బంధించారు.

ప్రజలను ప్రభుత్వం మోసం చేసింది: నేతలు

ఆరు గ్యారెంటీ హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్.. ఓటేసి గెలిపించిన ప్రజలను మోసం చేసిందని బీఆర్ఎస్, వామపక్ష నేతలు విమర్శించారు. పాలనా పగ్గాలు చేపట్టి 15 నెలలు దాటినా హామీలు అమలుచేయకుండా కాలయాపన చేస్తోందని, తాజాగా సన్నబియ్యం పేరిట ఆర్భాటాలు చేస్తూ హామీలను తుంగలో తొక్కే ప్రయత్నం చేస్తోందని మండిపడ్డారు. పోలీసులు అరెస్టు చేసిన వారిలో బీఆర్ఎస్ నాయకులు గోపిరెడ్డి రమణారెడ్డి, కొనకంచి శ్రీను, బెజ్జంకి కనకాచారి, చల్లకోటి పూర్ణచందర్ రావు, సోము లక్ష్మీచైతన్యరెడ్డి, పంగి సురేశ్, సీపీఎం నాయకులు బత్తుల వెంకటేశ్వర్లు, గడ్డం స్వామి, వెంకట్రావు, సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ నాయకుడు కెచ్చెల రంగారెడ్డి, మాలమహానాడు నాయకుడు అల్లాడి పౌల్‌రాజ్ తదితరులు ఉన్నారు.

జిల్లా జైలును సందర్శించిన డీజీ

జిల్లా జైలు ఎదుట జైళ్ల శాఖ డీజీ డాక్టర్ సౌమ్య మిశ్రా, ఇతర ఉన్నతాధికారులు

ఖమ్మంరూరల్, ఏప్రిల్ 6 : మండల పరిధిలోని జిల్లా జైలును ఆదివారం డైరెక్టర్ ఆఫ్ జనరల్ ప్రిజన్స్, కరక్షనల్ సర్వీస్ డైరెక్టర్ డాక్టర్ సౌమ్యమిశ్రా సందర్శించారు. ఖైదీలతో ముఖాముఖి ముచ్చటించారు. ఖైదీల బాగోగులను విచారించి వారికి జైలులో అందాల్సిన సదుపాయాలు అహారం, వైద్యం, న్యాయ సహాయం గూర్చి అడిగి తెలుసుకున్నారు. ఖైదీలకు కేటాయించిన లైబ్రరీని సందర్శించారు. ముద్దాయిలకు సంబంధించిన కిచెన్, వైద్యశాలను తనిఖీ చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. జైలులో ఉన్న స్టీల్, ఫినాయిల్ ఫ్యాక్టరీలను సందర్శించి ఉత్పత్తులను పరిశీలించారు. ఉత్పత్తులను పెంచడానికి సిబ్బందికి అవసరమైన సూచనలిచ్చారు. ఖైదీల మనోవికాసం, వారి ఆరోగ్యం రిత్యా జైళ్లశాఖ చేపట్టిన స్పోర్ట్స్‌మీట్ గురించి వివరించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ ప్రిజన్స్ యం.సంపత్, జైలు పర్యవేక్షకుడు ఏ.శ్రీధర్ పాల్గొన్నారు.

రిటైర్డ్ హెచ్ఎం ప్రాణం తీసిన

ప్రభుత్వ వైఫల్యం!

- రిటైరై 9 నెలలైనా బెనిఫిట్స్ అందక మనోవేదనతో మృతి

పాండురంగయ్య (ఫైల్)

ఖమ్మం అర్బన్, ఏప్రిల్ 6: విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పి వారిని ప్రయోజకులుగా చేసేందుకు జీవితాంతం శ్రమించాడు ఓ ప్రధానోపాధ్యాయుడు. చదువుకుంటే కష్టాలు తొలగిపోతాయని, చదువుతోటే ఉన్నత శిఖరాలు అధిరోహించవచ్చునని హితబోధ చేస్తూ విద్యార్థులకు పాఠాలు నేర్పాడు. కానీ ప్రభుత్వ వైఫల్యం కారణంగా అతడి విశ్రాంత జీవితం మానసికంగా వేదనాభరితమైంది. అనారోగ్యానికి గురైన వేళ మెరుగైన వైద్యం చేయించుకునేందుకు ఆర్థిక ఇబ్బందులతో సతమతమయ్యాడు. చివరికి ఉద్యోగ విరమణ ప్రయోజనాలను ప్రభుత్వం సకాలంలో అందించకపోవడంతో ఆర్థిక సమస్యలు చుట్టుముట్టి మనోవేదనతో ప్రాణాలు వదిలాడు. ఆయనే ఖమ్మం జిల్లాకు చెందిన కూరపాటి పాండురంగయ్య. ఖమ్మం జిల్లా ఏన్కూరులోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా పనిచేసిన కూరపాటి పాండురంగయ్య.. నిరుడు జూలైలో ఉద్యోగ విరమణ పొందాడు. ఇప్పటి తొమ్మిది నెలలు గడిచినా ఇంకా అతడికి రిటైర్మెంట్ బెనిఫిట్స్‌ను కాంగ్రెస్ ప్రభుత్వం అందించలేదు. అప్పటికే అనారోగ్యం భారిన పడిన ఆయన.. తీవ్ర మనోవేదనతో చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందాడు. ఖమ్మం శ్రీనగర్ కాలనీలోని తన నివాసంలో ఉన్న అతడి భౌతికకాయాన్ని ఉపాధ్యాయ సంఘాల నేతలు సందర్శించి నివాళులర్పించారు. ప్రభుత్వ వైఫల్యమే పాండురంగయ్య మృతికి కారణమని ఆగ్రహం వ్యక్తం చేశారు.

మానసిక ఒత్తిడితో..

రిటైర్మెంట్ అనంతరం ప్రభుత్వం నుంచి తన బెనిఫిట్స్ వస్తాయన్న నమ్మకంతో ఖమ్మంలోని తన ఇంటిపైన మరో అంతస్తు నిర్మాణం చేపట్టారు. 9 నెలలైనా కాంగ్రెస్ ప్రభుత్వం తన ఉద్యోగ విరమణ ప్రయోజనాలను అందించకపోవడంతో ఒత్తిడికి గురయ్యాడు. ఆ ఒత్తిడి అతడి ఆరోగ్యంపై ప్రభావం చూపింది. చివరికి చికిత్స పొందుతూ కన్నుమూశాడు. మృతుడికి భార్య, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. అతడి భార్య నిర్మల కూడా టీచర్ గానే పనిచేస్తున్నారు. కాగా, పాండురంగయ్య.. కూసుమంచి, చింతకాని, కొణిజర్ల, ఏన్కూరు మండలాల్లో పని చేశారు. యూటీఎఫ్‌లో అనేక బాధ్యతలు నిర్వర్తించారు.

బెనిఫిట్స్ అందకనే ఒత్తిడికి లోనయ్యాడు..

రిటైర్మెంట్ బెనిఫిట్స్ అందకపోవడం వల్ల అనేకమంది ఉపాధ్యాయులు, ఉద్యోగులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రశాంత జీవనం గడపలేకపోతున్నారు. పాండురంగయ్య కూడా కేవలం రిటైర్మెంట్ బెనిఫిట్స్ అందకపోవడం వల్లనే ఒత్తిడికి గురై తనువు చాలించాడు. 2024 మార్చి నుంచి ఇప్పటి వరకు ఉద్యోగ విరమణ చేసిన వారికి గ్రాట్యుటీ, కమ్యుటేషన్, జీపీఎఫ్, లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్ వంటి ప్రయోజనాలను ప్రభుత్వం అందించకపోవం వల్ల తీవ్రంగా ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

–రంజాన్, పారుపల్లి నాగేశ్వరరావు, యూటీఎఫ్ నేతలు